ప్రజాశక్తి

బుధవారం 9 జులై 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు



సమ్మె జయప్రదం కోసం సత్తెనపల్లిలో బైక్ ర్యాలీ

నేడు సార్వత్రిక సమ్మె

- 4 లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాటం
- రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపైనా డిమాండ్లు
- సమ్మె విజయవంతం కోసం రెండు నెలలుగా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

దేశ వ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు బుధవారం జరగనున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సమ్మె జయప్రదానికి ఆయా సంఘాలన్నీ సమాయత్తమయ్యాయి. వామపక్షాలతో పాటు ఎన్‌డిఎ యేతర రాజకీయ పార్టీల కార్మిక సంఘాలు కూడా పలు ప్రాంతాల్లో సమ్మెకు మద్దతునిచ్చాయి. కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్మిక, రైతు వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా ఈ సమ్మె జరగనుంది. కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు.

50 ఏళ్ల క్రితం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎంతో కాలం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి పలుకుతూ కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించింది. ప్రధానంగా కార్మికుల పనిగంటలపై నియంత్రణ ఉండదు. సంస్థ యజమాని ఎన్ని గంటలు పనిచేయాలంటే అన్ని గంటలు పనిచేసేలా నూతన చట్టాలలో కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే చాలా సంస్థల్లో 12 గంటల పని విధానం పరోక్షంగా అమలు చేస్తున్నారు. కేంద్రం రూపొందించిన చట్టాలకు అనుగుణంగా సంస్థల్లో పనిచేసే వారు 12 గంటలు పనిచేయాలని నిర్ధేశిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులివ్వడంపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. లేబర్ కోడ్‌లలో సమ్మె చేసే హక్కులను కూడా తొలగించారు. 2లో



గుంటూరు జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్

పథకాల అమలులో లోపాలపై ధ్వజం

- తల్లికి వందనంలో అనర్హతకు కారణాలు చెప్పాలి
- కౌలు రైతులకు రుణాలివ్వడం లేదు
- పిఎం కిసాన్‌లో రైతుల సంఖ్య తగ్గుదలపై అసంతృప్తి
- డిఆర్‌సిలో గళం విప్పిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు ఉన్నాయని, అర్హత ఉన్నా పథకాలు రాని పరిస్థితిపై టిడిపి ఎమ్మెల్యేలు జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళశారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్.శంకరన్ హాలులో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కౌలు రైతులకు అసలు రుణాలు ఇవ్వడం లేదని పలువురు ధ్వజమెత్తారు. వాస్తవ సాగుదారులకు కాకుండా భూ యజమానులకే అన్ని సదుపాయాలు దక్కుతున్నాయని, బ్యాంకర్లు క్షేత్రస్థాయిలో సహకరించడం లేదని ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, దూళిపాళ్ల నరేంద్ర అన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన నిబంధనల వల్ల ఇప్పటికీ అనేక మంది అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత సిలిండర్లకు సంబంధించిన నగదు చాలా మందికి జమకావడం లేదని, కారణమేమిటో ఎవ్వరూ స్పష్టమైన సమాధానం చెప్పడం లేదని అన్నారు. తుళ్లూరు మండలంలో పలువురు విద్యార్థుల తల్లులకు రూ.10 వేలు, 10,900 జమయ్యాయని సంబంధిత వివరాలను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖాధికారి వివరణిస్తూ ఈ నిధులు కేంద్రం ఇస్తుందని, మిగతా సొమ్ము త్వరలో వారి ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు అందించి బ్యాంకర్ల ద్వారా పంటరుణాలు మంజూరు చేసేలా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని శ్రావణ్‌కుమార్ కోరారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ రావడం లేదని, రుణాలు అందడం లేదని ఇవ్వన్నీ యజమానులే తీసుకుంటున్నాన్నారని, తన నియోజకవర్గంలో 9 వేల మంది కౌలు రైతులున్నారని అంచనా వేయగా 7 వేల మందికి సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి 78 మందికి రుణాలిచ్చారని ధ్వజమెత్తారు. దేవదాయశాఖ 2లో

జావాను నాగేశ్వరరావుకు తుది వీడ్కోలు



ప్రజాశక్తి - పెదనందిపాడు

నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం రాయినిగూడ వద్ద అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదనందిపాడు మండలం వరగాని గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఉదయగిరి నాగేశ్వరరావు (45), కుమారుడు వెంకట అభిషేక్ (21) మృతి చెందారు. సోమవారం రాత్రే వారి భౌతికకాయాలను వరగానికి తీసుకురాగా మంగళవారం ఉదయం ఎమ్మెల్యే బి.రామాంజనేయులు నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నాగేశ్వరరావు భౌతికకాయంపై రాజస్థాన్‌లోని బీకనీర్ 177 మీడియం రేజిమెంట్ సుబేదారులు బివి రమణ, రవీంద్ర టీం సభ్యులు జాతీయ జెండా ఉంచి, పూలమాలలేసి నివాళులు అర్పించారు. ప్రత్తిపాడు సిఐ జి.శ్రీనివాసరావు, పెదనందిపాడు ఎస్ఐ మధుపవన్ నివాళులర్పించారు. అనంతరం భౌతికకాయాలను ట్రాక్టర్‌పై ర్యాలీగా శ్మశానానికి తరలించారు. వాహనాన్ని దారిపొడవునా గ్రామస్తులు పూలుచల్లి నివాళులర్పించారు. ఎస్పీ కార్యాలయ ఆర్ఎస్ఐ యేసురాజు సిబ్బంది పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇదిలా ఉండగా నాగేశ్వరరావు, వెంకట అభిషేక్ భౌతికకాయాలను నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రి తరలించిన సందర్భంలో అక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎమ్మెల్యేకు మృతుల కుటుంబీకులు చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ అంశాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామని చెప్పారు. సైనికుని కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామన్నారు. నివాళులర్పించిన వారిలో తహశీల్దార్ ఎస్.హేనాప్రియ, పంచాయతీ కార్యదర్శి నాగయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.




తుళ్లూరులో జోలెపట్టి నిరసన తెలుపుతున్న రాజధాని పారిశుధ్య కార్మికులు

జోలె పట్టి, ఖాళీ ప్లేట్లతో పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన - 5 లో

సాగర్‌ను సందర్శించిన 24 దేశాల ప్రతినిధులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ శిక్షణ,పరిశోధన సంస్థలో ఈ నెల 1వ తేదీ నుండి 14వ తేదీ వరకు శిక్షణ పొందుతున్న 24 దేశాలకు చెందిన 37 మంది ప్రతినిధుల బృందం మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించింది. ప్రధాన డ్యామ్, జలాశయం, జల విద్యుదుత్పాదన కేంద్రం తదితర ప్రాంతాలను వీరు సందర్శించారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ చరిత్ర గురించి ఇరిగేషన్ అధికారులు వారికి వివరించారు. సాగర్ పర్యటన ఎంతో ఆసక్తిని రేకెత్తించిందని బృందం చెప్పింది. వారి వెంట ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు, ఎస్పీఫ్ సిబ్బంది ఉన్నారు.



నేటి సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

సత్తెనపల్లిలో బైక్ ర్యాలీ, కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచారం 2 లో

ప్రభుత్వ కాలేజి స్థలం ఆక్రమణ : మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని టిడిపికి చెందిన కొందరు ఆక్రమించి రోడ్డు వేశారని, ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా చేసి అమ్ముకోజూస్తున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. సంబంధిత స్థలాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మితమైందని, అప్పటినుంచి ఈ స్థలం ఇలాగే ఉండగా ప్రస్తుతం టిడిపి వారు కబ్జా చేసి అమ్ముకుంటున్నారని విమర్శించారు. పిడుగురాళ్ల పట్టణ, మండల ప్రజలకు ఉన్న ఒకే ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇదేనని, దీనిలో డిగ్రీ కూడా ఏర్పాటు చేసేందుకు వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రత్యేకతరగతి గదులు నిర్మాణానికి ప్రయత్నించినా ఎన్నికల వల్ల చేయలేకపోయామని చెప్పారు. కబ్జాపై అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని, దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మేము అధికారంలోకి వస్తే ప్రమాణ స్వీకారం రోజునే కబ్జా చెర నుండి స్థలాన్ని విడిపిస్తామని చెప్పారు.

విద్యార్థులకు వాసవి క్లబ్ యూత్ పుస్తకాలు

ప్రజాశక్తి - దుర్గి : స్థానిక జెడ్‌పి పాఠశాలలో 120 మంది 10వ తరగతి విద్యార్థులకు వాసవి క్లబ్ యూత్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులను మంగళవారం అందజేశారు. యూత్ మండల అధ్యక్షులు పల్చూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి సేవాభావం అలవర్చుకోవాలని, చదువుకున్న పాఠశాలకు, గ్రామానికి సహాయం చేయాలని కోరారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం హనుమంతరావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే విషయాన్ని వాసవి క్లబ్ నమ్ముతూ ముందుకు సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ కపలవాయి టెంపర్ శ్రీను, కాసుల ప్రసాదు పాల్గొన్నారు.

నేడు సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

సమ్మెకు పిలుపు ఇవ్వాలంటే పలు ఆంక్షలతో కూడిన నిబంధనలు విధించారు. సంస్థలు, ఫ్యాక్టరీలలో కార్మికులు యూనియన్ ఏర్పాటు చేయాలంటే గతంలో ఏడుగురు కార్మికులుంటే సరిపోయేది. ఇప్పుడు ఈ సంఖ్యను 100కి పెంచారు. సంఘంలో 100 కార్మికులు ఉంటేనే గుర్తింపును ఇస్తారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్లు కార్మికులు కోల్పోతున్నారు. ఇప్పటికే కీలకమైన ఎల్‌ఐసి, జిఐసి వంటి సంస్థలను కూడా ప్రైవేటీకరణకు కేంద్రం పచ్చజెండా ఊపింది. కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించడం, కేంద్ర ప్రభుత్వం సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా ఉద్యోగ భద్రతను కోల్పోతున్నారు. కనీస వేతనాల అమలుకు కూడా అవకాశం ఉండదు. కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు.

పంటలకు మద్దతు ధరలు అసలు లభించడం లేదు. కేంద్రం తెచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమించిన రైతులు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను కేంద్రం అంగీకరించినా అనంతరం హామీలను విస్మరించింది. మరోవైపు ఉపాధి హామీ చట్టం అమలుకు సంబంధించి వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, పనిదినాలు 200 వరకు అమలు చేయాలని వ్యవసాయ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే కేంద్రం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకుంది. ధరల పెరుగుదల, దేశంలో పెచ్చరిల్లుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజా సంఘాలు, కార్మికులు, రైతులు ఉద్యమించనున్నారు.

సమ్మె విజయవంతం కోసం జిల్లాలో కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో రెండు నెలలుగా విస్తృత ప్రచారం చేశారు. గుంటూరు జిల్లాలోని 18 మండలాలు, పల్నాడు జిల్లాలోని 28 మండలాలు, పట్టణ ప్రాంతాల్లో ఆయా సంస్థలు, కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లో సమ్మె నోటీసులు అందచేశారు. కార్మిక సంఘాల సాధారణ సమావేశాలు నిర్వహించి సమ్మె విజయవంతం చేయాలని తీర్మానం చేశారు. సమ్మెలో పాల్గొని అన్ని మండలాలు, పట్టణాల్లో ర్యాలీలు నిర్వహించాలని సిపిఎం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు పిలుపునిచ్చింది.



సత్తెనపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్



పెదకాకాని సమావేశంలో మాట్లాడుతున్న వై.నేతాజి

నేటి సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-సత్తెనపల్లి, పెదకాకాని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, పేదల వ్యతిరేక విధానాలను విడనాడాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని బుధవారం జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా నాయకులు గుంటూరు విజయ్‌కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం కోసం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో మంగళవారం సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టగా విజయ్‌కుమార్ మాట్లాడారు. గుంటూరు జిల్లా పెదకాకానిలో పి.ఆదిలక్ష్మి అధ్యక్షతన పంచాయతీ కార్మికుల విస్తృత సమావేశంలో నేతాజి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో విజయ్‌కుమార్, నేతాజి మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాసిందని, కార్మికులకు వ్యతిరేకంగా, యజమానులు అనుకూలమైన 4 లేబర్ కోడ్‌లను తెచ్చి ద్రోహం చేసిందని విమర్శించారు. పంటలకు మద్దతు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు కూడా కేంద్రంలోని బిజెపికి వత్తాసు పలుకుతూ అవే విధానాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు కట్టుబానిసలుగా మారిపోతారని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21వేలు ఇవ్వాలని, జీవో 132. 142. 680 అమలు చేయాలని, టెండర్లపై హైకోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని, కనీస వేతనం, గుర్తింపు కార్డులు, సబ్బులు, నూనె, గ్లౌజులు, మాస్కులు, వివిధ రకాల సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్మికుల తొలగింపును ఆపాలన్నారు. అంగన్వాడి, ఆశ మధ్యాహ్నం భోజనం, యానిమేటర్, విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సత్తెనపల్లి ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు జి.మల్లేశ్వరి, పి.మహేష్, ఎ.పసాద్‌రావు, ఎ.ఆంజనేయులు, కె.దుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, జె.రాజ్‌కుమార్, పి.ప్రభాకర్, జి.సుసులోవ్, కె.జగన్, ఎం.రవి కిరణ్, మస్తాన్‌వలి, జి.యేసురత్నం, జి.మస్తాన్‌రావు, కె.సుధ పాల్గొన్నారు. పెదకాకాని సమావేశంలో ఎన్.శివాజి, ఎస్.జైపాల్, వి.ఆవాజ్, రాహేలమ్మ, పి.సుజాత, రాజకుమారి, బి.మార్తమ్మ, సురేష్ పాల్గొన్నారు.

పథకాల అమలులో లోపాలపై ధ్వజం

(మొదటి పేజీ తరువాయి)

భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందించాలన్నారు. తాడికొండ నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. ఫిరంగపురం చర్చిని, సమీపంలోని కొండవీడు కోటను కలిపి టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ఇందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రుణాలు ఇవ్వకుండా ఎలా ఎగొట్టాలా అని బ్యాంకర్లు ఆలోచించడం తగదన్నారు.

నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులు, అనర్హుల వివరాలు స్థానిక అధికారుల వద్ద అందుబాటులో ఉంచాలని, పథకానికి అనర్హతకు గల కారణాలను తెలపాలని కోరారు. గతంలో నిర్వహించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వలన అర్హులు సైతం సంక్షేమ పథకాలకు అనర్హులు అవుతున్నారని, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ మార్చాలని కోరారు. అన్నదాత సుఖీభవలో తమ నియోజకవర్గంలో గతేడాది కంటే ఈ ఏడాది 11 వేల మందిని ఎందుకు తగ్గించారని నిలదీశారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల మందికి తగ్గించారని అన్నారు. ఇందుకు వ్యవసాయశాఖ అధికారి దాటవేత ధోరణిలో మాట్లాడటంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఒంటరి మహిళా పెన్షన్ల నిబంధనలు సరళతరం చేయాలని, పెదకాకాని జాతీయ రహదారిపై ప్రమాదాలకు కారణం అవుతున్న భవనం తొలగింపుకు నష్టపరిహారం సమస్యను పరిష్కరించాలని కోరారు. రద్దయిన జల్ జీవన్ పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో మౌలిక సౌకర్యాల అభివృద్ధి చేపట్టాలన్నారు. నగరపాలక సంస్థ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు డిపాజిట్ నగదు రూ.5000కు తగ్గించాలన్నారు. బొంగరాలబీడు కార్మికశాఖ స్థలంలో నిర్మించే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని విభాగాలను పూర్తి స్థాయిలో సమగ్రంగా నిర్మించాలని, రైల్వే స్టేషన్లు, ఆటోనగర్ వద్ద అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని, మరో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ తన నియోజకర్గం పరిధిలో రహదారుల పక్కన నాటిన ఆస్టోనియా స్కాలరిక్స్ వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని, వాటిని తొలగించాలని కోరారు. రహదారుల పక్కన ఉన్న మిర్చి తొడియాలు రహదారుల పక్కన వేయకుండా, వాటిని తగలబెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు ఇంటి పట్టాలను పంపిణీ చేయాలన్నారు. కల్తీ విత్తనాలు, పురుగుమందులు విక్రయాలు జరకుండ చర్యలు తీసుకోవాలని, అత్యధిక దిగుబడి వచ్చే ప్రత్యమ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్న వారికి రెగ్యులరైజ్ చేయాలన్నారు. జీవో 30 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజ్ చేస్తామని ఆర్‌డిఓ సమాధానమిచ్చారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మంగళగిరిలో పెరుగుతున్న జనభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా చేయాలని, డ్రెయిన్లు నిర్మించాలని, జాతీయ రహదారి సర్వీస్ రోడ్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ కౌలురైతులకు పంట రుణాలు మంజూరుకు రెవెన్యూ, వ్యవసాయశాఖ, బ్యాంకర్లుతో నిరంతరం సమీక్షిస్తామన్నారు. పి4ను సమర్థవంతంగా అమలుకు వివిధ రంగాల్లోని మార్గదర్శులను గుర్తించి ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశం ప్రారంభంలోనూ, తరువాత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం సిఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు జరిగేలా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు. సమాజ వనరులను వినియోగించుకొని అభివృద్ధి చెందిన మార్గదర్శులను, పేదరికంలోని బంగారు కుటుంబాలను సమన్వయ పరిచేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వల వద్ద జరుగుతున్న పనులను నీటి సంఘాలతో సమన్వయం చేసుకుంటూ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో ఆగస్టు 15 నాటికి 81,264 మందిని బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. హౌస్‌హోల్డ్ సర్వేలో ఎడిట్ ఆప్షన్ అంశాన్ని తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా, పట్టణాల్లో అమృత్ 2 పథకం ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని, పట్టణాల్లో అమృత్ 2 ద్వారా అందిస్తామని అన్నారు. డీఆర్సీలో చర్చించిన అంశాల్లో రాష్ట్ర స్థాయిలో వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 27 డిసెంబర్ 2024న జరిగిన గ్యాస్ ప్రమాదం వల్ల బాధితులకు నష్టపరిహారం అందడంలో అలసత్వం పనికిరాదని సంబంధిత గ్యాస్ ఏజెన్సీని హెచ్చరించారు. ఇదిలా ఉండగా 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' గుంటూరు మిర్చికి జాతీయ అవార్డు వచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని సమావేశం అభినందించింది. సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ కె.హెనీక్రిస్టీనా, రాజ్యసభ సభ్యులు ఎ.అయోధ్యరామిరెడ్డి, జెసి భార్గవ్‌తేజ,నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా, డిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డిసిఎంఎస్ చైర్మన్ వి.హరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి



ప్రత్తిపాడులో కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కారంపూడి

మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి76వ జన్మదిన వేడుకలు మంగళవారం కారంపూడి పట్టణంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు మరవలేనివని కారంపూడి వైసీపీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి. కొమ్మి రెడ్డి. ఎర్రగురవారెడ్డి, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము. చంద్రశేఖర్, వైయస్సార్సీపి మండల అధ్యక్షులు కొంగర. సుబ్రహ్మణ్యం, మండల యూత్ అధ్యక్షులు చిలుకూరి. చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు బొమ్మిన ఆల్లయ్య, వేముల లింగయ్య, షేక్. అక్బర్, షేక్ అరీఫ్, చిలుకూరి రవీంద్రారెడ్డి, అంతరగడ్డ ఏసోబు, గుండె బోయిన. శివ, కిల్లా. కాశి, గుండెబోయిన. దినకర్ బాబు, పుల్ల రెడ్డి, అంజిరెడ్డి, పంగులూరి. కిట్టయ్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో వైసిపి కార్యాలయం వద్ద సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో వైసిపి నాయకులు పక్కల సూరిబాబు షేక్ నాగుల్ మీరా అచ్యుత శివప్రసాద్ పట్టణ అధ్యక్షులు మౌలాలి వైసిపినాయకులు చెంచు రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ సెంటర్ వైఎస్ఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి, విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూజమాలలు వేసి నివాళులు అర్పించారు. జెడ్పిటిసి మల్లుస్వామి మాజీ మున్సిపల్ చైర్మన్లు బత్తుల ఏడు కొండులు, కోటయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, యువజన విభాగంవర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిధ్ధార్థ రెడ్డి పల్నాడు జిల్లా యువజ న విభాగం అధ్యక్షులు కందుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 280 మంది దాకా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి -దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ ఆర్ సీపీ నయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెలిదండి గోపాల్, మండల కన్వీనర్ ఉన్నాం వెంకటేశ్వర్లు, మండల యూత్ కన్వీనర్ ఎగటీల బుచ్చిబాబు, సీనియర్ నాయకులు చిన్నవెంకటయ్య వెంకటేశ్వర్లు, నరసింహారావు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

స్థానిక వైసిపి కార్యాలయం వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించి, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి జెడ్పిటిసి గాదె వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బదూరి చంద్రారెడ్డి, మండలం ఉపాధ్యక్షులు మోలాలి,నాగిరెడ్డిపాలెం సర్పంచ్ బద్ధురి శేషిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కారుమూరి భద్రయ్య, ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పెదకూరపాడు

సంక్షేమ పథకాలకు ఆదర్శనీయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. మంగళవారం రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మీరయ్య మాట్లాడుతూ సంక్షేమ పథకాలలో ఇతర రాష్ట్రాలకు కూడా రాజశేఖర్ రెడ్డి ముఖ్యుడన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సాంబిరెడ్డి, ఫోటో రఫీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలోమాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రక్తదాన శిబిరం, మహిళలకు చీరలు పంపిణీ, అన్నదాన కార్యక్రమంతో పాటు కొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, లేళ్ల అప్పి రెడ్డిపాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు చల్ల హనుమంత్ యాదవ్ మల్లయ పాలెం సెంటర్ వద్ద ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహం పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలు గ్రామాలలో భోజనాలు మండల పరిధిలోని పాత మల్లయపాలెం, గొట్టి పాడు, యనమదల, ఈదుల పాలెం, కొండేపాడు, గ్రామాలలో జయంతి సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు నిర్వహించారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా తెనాలి పట్టణంలో వైసిపి శ్రేణులు పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం తెనాలి మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ స్టానిక రణరంగ్ చౌక్ వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. అనంతరంభవిత కేంద్రంలో చిన్నారులకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు, కార్యకర్తలు పాన్నారు.

వైసిపిలోని రెండు గ్రూపుల ఘర్షణ మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

వైసీపీలోని ఇరువర్గాల ఘర్షణతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలోని ముప్పాళ్ల ఎస్సీ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పాత గొడవల నేపథ్యంలో వైసీపీలోని మెజార్టీ వర్గం ఇంకో వర్గంపై దాడిచేయగా మన్నం బాలయ్య భార్య విమలమ్మకి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు విమలమ్మని నర్సారావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలిం చారు. విమలమ్మకు తీవ్ర గాయాలై చేయి విరిగింది. ఎస్ఐ సోమేశ్వరరావుతమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక ఐతానగర్ కొత్తమాసు తులసీదాస్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఎన్నికల నిర్వహణ, ఎలక్షన్ ఫారాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 53 నుంచి 103 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి లక్ష్మీపతిరావు, తహశీల్దార్ కె.వి గోపాలకష్ణ పాల్గొని మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. బిఎల్వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘం వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

వరికి విత్తన శుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - పెదనందిపాడు

పమిడివారిపాలెం, పుసులూరు గ్రామాల లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్య క్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్ర హ్మణ్యం నిర్వహించారు. ఈ గ్రామంలో 250 నుంచి 300 ఎకరాల్లో వరి సాగు చేస్తారనీ, రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి కిలో వరి విత్తనానికి రెండు నుంచి మూడు గ్రాములు కార్బడైనిజం లేదా సూడోమోనస్ ఫ్లోరిసెన్స్ అనే మందుతో అయితే 5 నుంచి 8 గ్రాములు కిలోలు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని తెలి పారు. రైతులు అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులు వేసుకోవాలని సూచించారు.

పలు గ్రామాల్లో ఇంటింటికి తొలిఅడుగు కార్యక్రమం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీకష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఇంటింటికి వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మిర్చి మాజీ చైర్మన్ వెన్న సాంబశివారెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఓర్చు ఆనంద్, బెల్లంకొండ బీసీ సెల్ అధ్యక్షులు గంగారావు, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పి ఎస్ కే మస్తాన్ షరీఫ్ బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నల్లమేకల లక్ష్మీనారాయణ గ్రామ పార్టీ అధ్యక్షులు ఓర్చు రాంబాబు, గుడిసె కొండయ్య,, అక్కల వెంకట్రామిరెడ్డి వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు మహిళలు యువత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు మాచర్ల పట్టణంలోని 26వ వార్డులో "సుపరిపాలన లో తొలి అడుగు - ఇంటింటికి టిడిపి" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్ షాహెబ్, నియోజకవర్గ టీడీపీ నాయకులు యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, తెలుగుయువత నాయకులు మోసిన్, మాచర్ల వాసు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రజా సంక్షేమం, అభివద్ధి తెలుగుదేశం పార్టీ ధ్యేయమని పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గారపాడు, పరస, ఖమ్మంపాడు గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మక్కెన సాగర్ బెల్లంకొండ రాంగోపాల్రావు, గల్లా బాబురావు, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రజా సమస్యలు పరిష్కారించడానికి తొలి అడుగు కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. తొలి అడుగు కార్యక్రమంలో మంగళవారం స్థానిక 16, 17 వార్డుల్లో ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు పేరుతో రూ. 20 లక్షల కోట్లను దోచుకున్న గత ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న అమరావతి నిర్మాణం చెంపపెట్టు అన్నారు. గతంలో ఆగిపోయిన టిడ్కో గహాలను పూర్తిచేసి సంవత్సర కాలంలో లబ్దిదారులకు తిరిగి అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రజాసమస్యలను పరిష్కరించడమే తొలి అడుగు ముఖ్య ఉద్దేశమని అన్నారు.

వృద్ధురాలికి అత్యాధునిక చికిత్స

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆటోలో ప్రయాణిస్తుండగా వాటిల్లిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కాలికి విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన ఘనత తమకు సొంతమైందని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గురజాలకు చెందిన 62 ఏళ్ల వృద్ధురాలు ప్రయాణంలో గాయపడి కాలు తొలగించే పరిస్థితి ఏర్పడిందన్నారు. చివరకు తమ వద్దకు రాగా ఇఎస్ఐ కార్డు ద్వారా పూర్తి ఉచితంగా అరుదైన శస్త్ర చికిత్స చేశామన్నారు. ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ నవీన్ సుంకర ఆధ్వర్యంలో వైద్య బృందం నూతన సాంకేతిక విధానంలో క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించా రన్నారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాలకు ధీటుగా క్లిష్టమైన, పెద్ద ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

గంజాయి స్వాధీనం-ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక అడవితక్కెళ్లపాడులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 456 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ జిల్లా అధికారి వి.అరుణకుమారి తెలిపారు. స్థానిక సిఐ ఎం.యశోధర దేవి ఆధ్వర్యంలో అడవితక్కెళ్లపాడు వద్ద మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించగా అనుమానస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు షేక్ జఫార్ అహ్మద్, పెట్లూరి సాహిద్, దాసరి సుమంత్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి గంజాయి బయటపడింది. వీరు ప్రయాణిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేశారు. వీరు గుంటూరులో ఈశ్వర్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్టు వారి వద్ద నుంచి చెప్పారని అతని ఆచూకి కోసం గాలిస్తున్నామని అరుణకుమార్ తెలిపారు. ఎస్ఐలు మాధవి, పి.ఆర్.కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి అండగా నిలిచిన అవినాష్

బాధిత కుటుంబానికి జన సైనికులు అండ

ప్రజాశక్తి - మంగళగిరి

రోడ్డు ప్రమాదంలో గాయపడి జీవనాధారం కోల్పోయిన మంగళగిరి పరిధి టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న వామనపల్లి యోగానంద్ కుటుంబానికి జనసైనికులు అండగా నిలిచారు. మంగళవారం జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు చిట్టెం అవినాష్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను యోగానంద్ నివాసానికి వెళ్లి సహాయాన్ని అందజేశారు. అవినాష్ మాట్లాడుతూ, యోగా నంద్ కుటుంబానికి భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. యోగానంద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన పార్టీ కార్యకర్తలు పసుపులేటి బాబు, అనపర్తి సుకుమార్, పులిజగదీష్, వాసు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా పరికరాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పరికరాలను వారు సద్వినియోగ పరుచుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని మండల విద్యా శాఖ అధికారి ముద్దన శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పెదనందిపాడు మండల విద్యా వనరుల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, విద్యార్థులకు ఐదు వీల్ చైర్స్, రెండు రోలేటర్స్, ఒక సీపీ కమాండ్, రెండు బ్రెయిలీ కిట్స్‌ను ఆయా విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాసరావు, కొత్తపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఫిజియో థెరపిస్ట్ ఎస్ బాల బ్రహ్మాచారి, ఉపాధ్యాయులు ఎస్ పరిమళ, కెవిఎస్ పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని ప్రత్తిపాడు వ్యవసాయ అధికారి సుగుణ బేగం అన్నారు. మంగళ వారం ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మలపాలెం, ఎనమదల గ్రామములో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు డిజిటల్ క్రాప్ సర్వే గురించి తెలియజేసారు. రైతులు విత్తనం నాటే ముందు విత్తన శుద్ధి తప్పనిసరి అని వరి పంటలో వరి విత్తన శుద్ధి ఏ విధంగా చేసుకోవాలో చూపించారు. సిసిఆర్‌సి (కౌలు రైతు కార్డు)ల ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.కౌలుకు వ్యవసాయం చేస్తున్న రైతులు అందరు తమ గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రం సిబ్బంది లేదా వీఆర్‌ఓ సంప్రదించి కౌలు కార్డును పొందాలని తెలియజేసారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది గోపి, యేసు రత్నం మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేకుంటే చెప్పండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అంగలకుదురు, కోపల్లె, గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె సుధీర్ బాబు రైతులతో మాట్లాడారు. వరి విత్తనాలను విత్తేముందు విత్తన శుద్ధి చేయాలన్నారు. అనంతరం వరి విత్తనాలను పొలాల్లో విత్తుకుని పలు రకాల తెగుళ్ళు నుండి పంటలను రక్షించుకోవచ్చని తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులకు అర్హత ఉండి జాబితాలో పేరు నమోదుకాని రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఈఓ సోనియా, విఎఎ దీపిక, అభ్యుదయ, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

నేడు సమ్మెలోకి వివిధ రంగాల కార్మికులు



ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

కార్మిక హక్కుల పరిరక్షణ, లేబర్ కోడ్‌ల రద్దు, ఇతర సమస్యల పరిష్కారం కోసం బుధవారం జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు భాగస్వామ్యం కావాలని సిఐటియు పల్నాడు జిల్లా నాయకులు జి.మల్లీశ్వరి పిలుపునిచ్చారు. ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో సమ్మెలో వారూ పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కవితకు ఆశ వర్కర్లతో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. మల్లేశ్వరి మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేసి జీవోను విడుదల చేయాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ధర్మసింగ్‌శాస్త్రికి ఆశాలు సమ్మె నోటీస్ ఇచ్చిన సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హరిపోతురాజు మాట్లాడుతూ ఆశాలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్, మండల కన్వీనర్ పి.మహేష్, ఆశాలు రాధా కుమారి, పద్మజ మల్లేశ్వరి, శ్రీదేవి, నాగమల్లేశ్వరి, మౌనిక పాల్గొన్నారు.

బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొనాలని భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ప్రసాద్‌రావు, షేక్ సిలార్ మసూద్ పిలుపునిచ్చారు. స్థానిక వెంకటపతి కాలనీలో వారు విలేకర్లతో మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని, ఇవి అమలైతే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు, దాని ద్వారా అమలవుతున్న 14 రకాల సంక్షేమ పథకాలు రద్దవుతాయని చెప్పారు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలు ఈ లేబర్ కోడ్లను అమలు చేసేది లేదని అసెంబ్లీలో తీర్మానాలు చేశాయని, మన రాష్ట్రంలో మాత్రం కూటమి ప్రభుత్వం అత్యుత్సాహంతో అమలుకు పూనుకుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో లేబర్‌కోడ్‌లను తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యంగా సమ్మెలో పాల్గొనాలన్నారు. సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మొగల్ ఆదామ్, గొట్టిపాటి సాల్మన్‌రాజు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - రాజుపాలెం

స్థానిక పిహెచ్‌సి వద్ద నిర్వహించిన ఆశాల సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు జి.రవిబాబు మాట్లాడారు. ఆశాలకు పని భారం పెరిగినా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. సమ్మెలో రైతుల, కౌల్దార్లు, వ్యవసాయ కార్మికులు కూడా పాల్గొనాలని రైతు సంఘం నాయకులు ఎం.పిచ్చిరెడ్డి కోరారు. అనంతరం పిహెచ్‌సి వైద్యులకు సమ్మె నోటీసు ఇచ్చారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డికి పంచాయతీ కార్మికులు నోటీసు ఇచ్చారు. సిఐటియు నాయకులు జి.మల్లేశ్వరి మాట్లాడారు.

ప్రజాశక్తి - కారంపూడి

దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి షేక్ సైదా కోరారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు సూర్య హనుమంతరావు, ఎం.చిన్నకోటిరెడ్డి, ఐ.శ్రీనివాసరావు, కె.నాగమణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు పంచాయతీ కార్యదర్శికి కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నోటీసు ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు



మాట్లాడారు. సమ్మెలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు అమరావతిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన ఉంటుందని, అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని కోరారు.



ప్రజలపై కూటమి విద్యుత్ భారాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రజలకు అదనపు భారంగా ఉన్న స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా నరసరావుపేట మండలం పాలపాడు గ్రామంలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని తన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పదేపదే చెప్పారని గుర్తు చేశారు. కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలలో భాగంగా విద్యుత్ చట్ట సంస్కరణలను తెచ్చి, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. మీటరు ఏర్పాటుకు వినియోగదారుల అనుమతి తీసుకోవాల్సి ఉన్నా అదాని కంపెనీ ప్రతినిధులు అవేమీ లేకుండానే బలవంతంగా బిగిస్తున్నారని మండిపడ్డారు. సిపిఎం మండల కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాలలో సైతం స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకిస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మోడీ విధానాలను అమలు చేసేందుకు సిఎం చంద్రబాబు ఉవ్విళ్లూరుతున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లను రిమోట్ ద్వారా ఆపరేట్ చేసే నూతన సాంకేతికత ఉందని, కొన్ని సందర్భాలలో ఇది అత్యంత ప్రమాదకరమని చెప్పారు. వినియోగించుకున్న విద్యుత్‌కు తర్వాత డబ్బులు చెల్లించే ప్రస్తుత పద్ధతికి భిన్నంగా ముందుగానే డబ్బులు చెల్లించి రీ ఛార్జింగ్ చేస్తేనే విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.పెద్దిరాజు, కె.నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, ఇస్రాయేలు, పుల్లారెడ్డి పాల్గొన్నారు.



రావూరి సీతారామయ్యకు నివాళులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని ఫణిదం గ్రామంలో రావూరి సీతారామయ్య 13వ వర్ధంతి సభ సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి వి.తులసీరామ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. స్తూపానికి సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. గ్రామాభివద్ధికి సీతారామయ్య ఎంతో కృషి చేశారని చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్, నాయకులు ఎం.నరసింహారావు, ఆర్.పూర్ణచంద్రరావు, ఎస్.కె హుస్సేన్నా, కె.వెంకటేశ్వర్లు, సీతారామయ్య కుటుంబీకులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కింద పండ్ల తోటల పెంపకం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. ఉపాధి హామీ కింద మండలంలోని కంటెపూడి గ్రామంలో చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టారు. రైతు తేల్లూరి ముకుదారెడ్డి పొలంలో మంగళవారం నిమ్మ మొక్కలు నాటిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ఉపాధి హామీ కింద నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరావు, నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.రామ చంద్రరావు, ఎ.సాంబయ్య, ఇన్‌ఛార్జి ఏపీడీ పివి నారాయణ, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, ఇసి హరిత పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

హైకోర్టు న్యాయవాది కోటిపల్లి అయ్యప్పపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక నాలుగు కోర్టుల విధులను మంగళవారం బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్నం మణిబాబు, కార్యదర్శి బయ్యవరపు నరసింహారావు, సబ్ కోర్ట్ కార్యదర్శి జానీ ఖాజావలి, టి.హరనాథ్, చిట్టా విజయభాస్కరరెడ్డి, సిహెచ్.చినసత్యనారాయణ, సయ్యద్ అబ్దుల్ రహీమ్, కె.వెంకటేశ్వరరావు, ఆర్.శివనాగేశ్వరరావు, ఆర్.నరసింహ రావు, డి.శ్రీనివాసరావు, ఆర్.గోపాలకృష్ణమూర్తి, సిహెచ్.బాబురావు, జె.విజయ్ కుమార్, బి.రామిరెడ్డి, బి.సంగీతరావు, ఎల్.సాంబిరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, జి.వెంకటశివ పాల్గొన్నారు.



పేదరిక నిర్మూలనకు ధనికులు సహకరించాలి

పి4పై ఎమ్మెల్యేలు, అధికారులతో ఇన్‌ఛార్జి మంత్రి సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పి4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) ద్వారా జిల్లాలో పేదరికం నిర్మూలనలో భాగమవుదామని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర జిల్లా విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ - స్మార్ట్ ఆంధ్ర ప్రదేశ్ ఫౌండేషన్ జిల్లా చాప్టర్‌పై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి మంత్రి మంగళవారం సమీక్షించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలు పి4 కార్యక్రమంలో మార్గదర్శకులుగా నమోదు చేసుకుని ఆర్థికంగా వెనకబడిన వారిని అభివృద్ధి పథంలో నడిపించడానికి సహకారం అందించాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో నిర్దేశించిన లక్ష్యం మేరకు బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక పూర్తి చేయడంలో ఎంపీ, ఎమ్మెల్యేలు కీలక భాగస్వామ్యం తీసుకుంటారన్నారు. పేదరిక నిర్మూలనలో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేర్చడం కీలకమని, అర్హతున్నా ఉచిత గ్యాస్ సబ్సిడీ, తల్లికి వందనం వంటి పథకాలు పొందని కుటుంబాలను గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. రైతుల ఆదాయం పెంచే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు ప్లాస్టిక్ ఉత్పత్తిదారులపై కఠినంగా వ్యవహరించాలని, నరసరావుపేట, సత్తెనపల్లి డంపింగ్ యార్డులోని చెత్తను పూర్తిగా తొలగించాలని చెప్పారు. నియోజకవర్గానికి 10 వేల కుటుంబాలకు సూర్యఘర్ ద్వారా సోలార్ విద్యుత్ అమర్చాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, భాష్యం ప్రవీణ్, జెసి సూరజ్ ధనుంజయ్, డీఆర్వో మురళి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

63,912 కుటుంబాల గుర్తింపు

అనంతరం పి4పై మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది ధనికులు మార్గదర్శకులై అత్యంత పేదలైన 20 శాతం బంగారు కుటుంబాలకు వచ్చేనెల 15వ తేదీలోపు చేయూతనివ్వడం పి4 లక్ష్యమన్నారు. జిల్లాలో 63,912 అతినిరుపేదలైన కుటుంబాలను గుర్తించామని, వీరికి ధనికులైన మార్గదర్శకులు చేయూతనివ్వాలని కోరారు. ఆసక్తి గల మార్గదర్శకులు పి4 వెబ్‌సైట్‌లో నమోదై బంగారు కుటుంబాలను, గ్రామాలను దత్తత తీసుకోవాలని కోరారు. పరిశ్రమలు ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇస్తున్నామని, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసే వారికి సబ్సిడీలతో పాటు, యూనిట్ల స్థాపనలో సాంకేతిక మద్దత్తు అందిస్తామని చెప్పారు. జిల్లాలో ఏటా వృద్ధి రేటును 15 శాతం సాధించేలా కృషి చేయాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

నేటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు భాగస్వామ్యం కావాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న ప్రజా సంఘాల కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ విస్తృత సమావేశం ఏపీ మున్సిపల్ వర్కర్స్ పారిశుధ్య కార్మికుల తాడేపల్లి మండల అధ్యక్షులు మేకల డేవిడ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని విమర్శించారు. గత ఐదు సంవత్సరాలుగా నైపుణ్యానికి తగిన వేతనం అందక మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దుర్భర జీవితం అనుభవిస్తున్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలకు విన్నవించిన, పాలకులు మారుతున్నారు తప్ప ఇంజనీరింగ్ కార్మికుల జీవితాలు మార్పు చెందడం లేదని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తోను అనేక దఫాలుగా సమస్య పరిష్కరించాలని విన్నవించిన పరిష్కారం కాలేదన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్య గత 17 రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన ఒప్పందాల జీవోలను వెంటనే జారీ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు జీతాల ఆంక్షలు లేకుండా, సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు రూ.18 వేల జీతం వస్తుందని సాకుతో సంక్షేమ పథకాలు కోత పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. పెరిగిన నిత్యవసర ధరలు రీత్యా, పట్టణాలలో అద్దెలు కట్టుకోలేని పరిస్థితులలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన చెందారు. మే, జూన్ నెలలో మున్సిపల్ శాఖ మంత్రి సమక్షంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చర్చలు జరిగినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆయన మండిపడ్డారు. వెంటనే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జులై 12వ తేదీ అర్ధరాత్రి నుండి ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని ఆయన హెచ్చరించారు. కార్మికుల సమ్మె వలన ప్రజలకు ఏ విధమైన అవాంతరం ఏర్పడిన, ఆరోగ్య సమస్యలు తలెత్తిన ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిఐటియు మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ తాడేపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు చొక్కా మరియదాసు, మేకల డేవిడ్, సిద్ధిల ప్రసన్న, దావులూరి సుధీర్, మొంద్రు కోటేశ్వరరావు, పాతూరి అశోక్, మోపర్తి మారయ్య, చిలువూరు సరోజిని, వెంకటేశ్వరరావు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు



ఉండవల్లిలో



కొల్లిపరలో


ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ లో మంగళవారం ఆశా వర్కర్లు ప్రైమరీ సెంటర్ వైద్యులు నాగేంద్రబాబుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు కోలంటి శ్యామల, కె. భారతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



కుంచనపల్లిలో

ప్రజాశక్తి - కొల్లిపర: జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె సందర్భంగా మంగళవారం కొల్లిపర మండలంమున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎన్ కే సుమతికి ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ములకా శివ సాంబిరెడి, ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎం జయప్రద మాట్లాడుతూ బుధవారం 9 గంటలకు ఆశా కార్యకర్తలు అందరూ కొల్లిపర అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని అక్కడ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో బాపట్ల అరుణ శివలీల పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు జరుగునున్న సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి కోరారు.



మంగళగిరి రూరల్

మంగళవారం రాజధాని ముఖద్వారం అయినా ఉండవల్లి ఒకటి, రెండు శశి వాళ్ళ దగ్గర జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : నేడు జరిగే భారత బందును జయప్రదం చేయాలని కోరుతూ సమ్మె నోటీసులను వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అందించారు. వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పెద్దవడ్లపూడి, నూతక్కి గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు, స్కూలుకు నోటీసులు అందించారు. మోర్ల కోటిలింగం, కోట నంబూద్రి పాద్, సాంబశివరావు, కృష్ణ, సుగుణ కుమార్, దుర్గారావు పాల్గొన్నారు.

జోలె పట్టి, ఖాళీ ప్లేట్లతో పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజధాని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు.రాజధాని గ్రామాలలో, సచివాలయం, అసెంబ్లీ,హైకోర్టులో పనిచేస్తున్న పారిశుధ్య విధులు నిర్వర్తిస్తున్నామని,ప్రభుత్వం,సి ఆర్ డి ఎ అధికారులు అరకొర జీతాలతో సరిపెడుతున్నారని పారిశుధ్య వాపోయారు. మంగళవారం మందడం,వెలగపూడి, తుళ్లూరు, ఐనవోలు, అనంతవరం, నెక్కల్లు తదితర గ్రామాల్లో కార్మికులు పని విరామ సమయంలో నిరసనలకు దిగారు. తుళ్లూరులో కార్మికులు జోలె పట్టుకొని,నెక్కల్లులో ఖాళీ ప్లేట్లతో రోడ్లపై మోకాళ్ళ పై నిలబడి నిరసన తెలిపారు.కార్మికులకు సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ మద్దతుగా నిలిచింది. ఈ సందర్భంగా మందడం పంచాయితీ కార్యాలయం వద్ద కార్మికుల నిరసనలో సిఐటియు



రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి పాల్గొని మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచాలని నిలిపివేసిన సామాజిక పెన్షన్ ను పునరుద్ధరించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని అన్నారు.సంవత్సరం గడుస్తున్నా రాజధాని పారిశుధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్మికులు పని విరామ సమయంలో సిఐ



టియు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో రోడ్లపై నిరసనలకు దిగాల్సి వచ్చిందన్నారు. ౦౦డు రోజులుగా పారిశుధ్య కార్మికులు నిరసన తెలుపుతున్నారని చెప్పారు.

9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి..

బుధవారం దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రవి పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక విధానాలను పాలకులు విడనాడాలని,నల్ల చట్టాలను రద్దు చేయాలని,కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని అన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కోటేశ్వరరావు



ప్రజాశక్తి - గుంటూరు లీగల్

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది యడ్లపల్లి కోటేశ్వరరావును నియమిస్తూ కమిషనర్ పి.శ్రీనివాసులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోటేశ్వరరావు రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో 1994లో న్యాయవాదిగా నమోదయ్యారు. అప్పటి నుండి ఆయన గుంటూరు జిల్లా కోర్టులో పని చేస్తున్నారు. ఈయన ప్రముఖ న్యాయవాది గుంటుపల్లి రామలింగేశ్వరరావు వద్ద జూనియర్ న్యాయవాదిగా తన న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అనంతరం సొంతగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కోటేశ్వరరావు పలు ప్రముఖ సివిల్, క్రిమినల్ కేసులు వాదించారు. ఈయన స్టాండింగ్ కౌన్సిల్‌గా మూడేళ్లపాటు వ్యవహరిస్తారు. కోటేశ్వరరావుకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

రిజర్వాయర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని త్రాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. మంగళవారం లాడ్జి సెంటర్‌లోని హైలెవల్ రిజర్వాయర్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని త్రాగునీటి రిజర్వాయర్లను షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయాలని, శుభ్రం చేయడానికి ముందు, తర్వాత ఫొటోలను తీయాలన్నారు. ప్రస్తుతం శుభ్రం చేసిన తేదీ, తదుపరి శుభ్రం చేయాల్సిన తేదీలను బోర్డులమీద ప్రదర్శించాలన్నారు. త్రాగునీటి సరఫరాలో ఏ విధమైన సమస్యలు రాకుండా ఏఈల వారీగా భాధ్యత వహించాలన్నారు. రిజర్వాయర్ దగ్గర నుండి నీటిని సరఫరా చేసే సమయం, రిజర్వాయర్ పరిధిలోని టయిల్ ఎండ్ ప్రాంతాల్లో త్రాగునీటి శ్యాంపిల్స్ తీయాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. హెచ్ఎల్ఆర్ పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఉండడం, స్క్రాప్ అడ్డదిడ్డంగా ఉండడం గమనించి, రిజర్వాయర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



విద్యార్థి నాయకులతో సెక్రెటరీ, ప్రిన్సిపాల్, ఏఓ

కెఎల్‌పి స్కూల్లో విద్యార్థి నాయకత్వ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్పి పాఠశాలలో మంగళ వారం విద్యార్థి నాయకత్వ ప్రకటన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏఓ కె.వెంకట్రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ఎన్నికల్లో ఎన్నికైన విద్యార్థి నాయకులతో, క్యాబినెట్ మండలి విద్యార్థులతో, నాలుగు విభాగాల నాయకులు, ఉపనాయకులతో డాక్టర్ కృష్ణప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యం, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను ప్రణాళిక ద్వారా శిక్షణతో నిర్వహించటం వల్ల సాధించవచ్చని అన్నారు. కావున ప్రతి విద్యార్థి నేర్చుకుంటూ ఎదగాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపిలను ఏవిధంగా ఎన్నుకుంటామో అదే విధంగా విద్యార్థి నాయకుల్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. ఏఓ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఉత్తమ నాయకులుగా ఎదుగుతూ, ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఉద్యాన పంటల సాగుకు రాయితీలు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తే ప్రభుత్వం రాయితీ కింద ఆర్థిక సాయం చేస్తుందని వీటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి కోరారు. మంగళవారం ఉపాధి హామీ పండ్లతోటల సాగు కార్యక్రమంలో భాగంగా రెంటచింతల పొలిమేరలో బి విజయ్ పొలంలో సపోటా తోటను సాగు చేసే నిమిత్తం తొలుతగా భూమి పూజ చేసి తరువాత మొక్కలను నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం జూదంగా మారిన నేపథ్యంలో వాణిజ్యపంటలకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలైన మామిడి, జామ, నిమ్మ, సపోటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, మునగా కొబ్బరి, యాపిల్, బేర్, నేరేడు, సీతాఫలం లాంటి పంటలను సాగు చేస్తే ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో రాయితీలు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీ డి కె మల్లికార్జునరావు ఏపీఓ వెంకటేశ్వర్లు, ఉద్యానవన శాఖ అధికారి ఎనిబెరా, మోహన్ టిడిపి మండల అధ్యక్షులు అప్పి రెడ్డి,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-ఈపూరు

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలనీ, ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని ఏవో ఆర్ రామారావు రైతులకు సూచించారు. మండలంలోని అగ్నిగుండాల, ఊడిజర్ల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి షేక్‌రసూల్‌నబి మాట్లా డుతూ ప్రతి పంటకు విత్తన శుద్ధి చేయాలని అప్పుడే పంటలను వ్యాపించే తెగుళ్లు, పురుగుల ఉధృతి తగ్గుతుందన్నారు. ప్రతి రైతు సాగు సమయంలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారిని ఎం.సునీత, వ్యవసాయ శాఖ సహాయకులు జి.యతీంద్ర నాగరాజు, ఉద్యాన శాఖ సహాయకులు వి.గణేష్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నకరికల్లు

మహిళలపై జరిగే నేరాల గురించి మండల పరిధిలోని ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పీ. కిరణ్ తెలిపారు. నకరికల్లు పోలీస్ స్టేషన్‌ని మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం రికార్డులను, కేసు ఫైళ్లను పరిశీలించి, కేసుల విచారణ తర్వాత గతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాలలో గంజాయి నిర్మూలన, నేరస్తుల కదలికమీద నిఘా ఉంచి వారి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో కలిసి రోడ్డు టెస్టులో డిపిటీఓ అజితకుమారి

బస్సుల సామర్థ్యం మెరుగు పరచుకోండి : డిపిటిఒ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎప్పటికప్పుడు బస్సుల సామర్థ్యం మెరుగు పరుచు కోవాలని డిపిటీఓ అజిత కుమారి అన్నారు. మంగళవారం నరసరావుపేట ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న గ్యారేజీని ఆమె సందర్శించారు. గ్యారేజీ సిబ్బంది డిపిటీఓను ఘనంగా సన్మానించారు. అనంతరం అజిత కుమారి షెడ్యూల్-3 బస్సును పరిశీలించి, గ్యారేజీ కార్మికులతో కలిసి రోడ్‌టెస్ట్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు సన్నాహాలు చేయాలని ఆదేశించారు. బస్సులను సమర్థవంతంగా నిర్వ హించడానికి, అవసరమైన స్పేర్ పార్ట్స్ సమకూర్చు కోవడానికి, బస్సులు రోడ్డుపై ఆగిపోకుండా ప్రయాణికులు అసౌకర్యానికి గురి కాకుండా చూసుకోవాలని గ్యారేజీ కార్మికులు వాహనాల నిర్వహణలో మెరుగైన ప్రమాణాలు పాటించాలన్నారు.

అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగు : కలెక్టర్



మొక్కను నాటుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని దీర్ఘకాలం ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటలు సాగు చేపట్టి ఆర్థికాభి వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామానికి చెందిన రైతు రావి ఏడుకొండలు 1.50 సెంట్ల వ్యవసాయ భూమిలో మామిడి మొక్కలునాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతు పొలంలో పండ్లతోటల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. ఒకేరోజున రాష్ట్ర వ్యాప్తంగా 25వేల ఎకరాలలో పండ్ల మొక్కలు నాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలో లక్ష్యం మేరకు 600 మొక్కలు నాటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ టివి కృష్ణకుమారి, తహశీల్దారు కొనికినేని వేణుగోపాలరావు, ఉపాధి సిబ్బంది, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై పల్నాడు జెసి సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం దిశగా రెవిన్యూ అధికారులు కృషి చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో రెవిన్యూ, స్పందన ఫిర్యాదులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల స్థలాల అప్లికేషన్, పిజిఆర్ఎస్‌లో వచ్చిన అప్లికేషన్లు, ఫిర్యాదులు, జీఓ ఎంఎస్ నెంబర్. 30, ఐవిఆర్ఎస్ కాల్స్ రెవెన్యూ పరమైన సమస్యలపై సమీక్షలో చర్చించారు. జిల్లా రెవిన్యూ అధికారి మురళి, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు కె. మధులత, రమణకాంత్ రెడ్డి, మురళీకష్ణ, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి బాల సుబ్రమణ్యం, పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి సూరజ్ ధనుంజయ్‌గనోరే

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నరసరావుపేట

గత 11 సంవత్సరాలుగా పెంచని జీతాలను తక్షణమే పెంచాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పల్నాడు జిల్లా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుండి మున్సిపల్ కార్మికులకు రూపాయి కూడా జీతం పెంచలేదని, లేబర్ కోడ్ యాక్ట్ రద్దయితే కార్మికుల సమస్యలపై మాట్లాడే పరిస్థితి ఉండదనీ, సమ్మె చేసే హక్కు, జీతాలు అడిగే హక్కు ఉండదని అన్నారు. మున్సిపల్ కార్మికులకు, ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ అంబానీలకు ఊడిగం చేస్తుందని దుయ్యబట్టారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం పెంచాలని జీవో 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలనీ పెరిగిన పట్టణానికి అనుగుణంగా కార్మికులను పెంచి మున్సిపల్ కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కార్మికులపై అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని లేదంటే దశల వారీ ఆందోళన పోరాటాలు చేస్తామన్నారు. సరైన పనికి సరైన వేతనం ఇవ్వాలని ఈనెల 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అనంతరం సిద్ధం సిద్ధం సమ్మెకు సిద్ధం అంటూ నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక అంబేద్కర్ బొమ్మ వరకు అర్థం నగ్న ప్రదర్శన చేశారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

దళితుల ఆర్థికాభివృద్ధే కూటమి లక్ష్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో మంగళవారం పల్నాడు జిల్లా ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్.సి కాంప్లెక్స్ నిఋణాలు తీసుకున్న లబ్ధిదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్.సి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ పాల్గొని మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ద్వారా సాధ్యమన్నారు. వైసిపి హయాంలో దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలు రద్దు, ఎస్.సి సబ్ ప్లాన్, కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం చేశారని ఎంతోమంది దళితులు హత్యకు, దళిత మహిళలు అత్యాచారాలకు గురయ్యారన్నారు. ఎస్సి కార్పొరేషన్ లబ్ది పొందిన లబ్ధిదారులకు పాత బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎస్.సి సంక్షేమానికి రూ 20 వేల కోట్లు కేటాయించిందన్నారు. ఎస్.సి కార్పొరేషన్ ఎఇఓలు ఈశ్వరయ్య, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో అధికారంలోకి చంద్రబాబు : వైసిపి



మాట్లాడుతున్న తాడి వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాడని మాచర్ల మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాబు షఉరిటీ - మోసం గ్యారంటీ నియోజకవర్గ విస్తతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసి అధికారంలోని వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిపి మండ్లి మల్లుస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్లు కామన బోయిన కోటయ్య, బత్తుల ఏడుకొండలు, యరబోతుల శ్రీనివాసరావు, పోలా శ్రీనివాసరావు మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మరెడ్డి, వెలిదిండి ఉమాగోపాల్ మాచర్ల నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు, మండల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

ప్రభుత్వాస్పత్రిలో పర్యావరణ పరిరక్షణ ఉద్యమం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అమ్మి ఫౌండేషన్ చేపట్టిన పర్యావరణ పరి రక్షణ ఉద్యమాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన స్వయంగా మొక్కను నాటారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి సామాజిక చొరవలు ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచే విధంగా సాగాలన్నారు. అనంతరం మద్దినహార్‌లో విధులలో 25 మొక్కలు నాటారు. అమ్మి ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ షేక్ అఫ్రోజ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ ఫౌండేషన్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో చేతన్, అజీజ్, ఆషిక్ రోషన్, ఈశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భరద్వాజ

జాతీయ సుక్షిత మాతృత్వ దినోత్సవం

ప్రజాశక్తి - యడ్లపాడు

జాతీయ సుక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. లింగఆధారిత గర్భస్రావాలను నిషేధించటం, ఆడపిల్లలను రక్షించటంపై డాక్టర్ భరద్వాజ అవగాహన కల్పించారు. ఫౌండేషన్ అధ్యక్షులు నరేంద్ర సువర్ణకుమారి, ఉపాధ్యక్షులు, వై.ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశాలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వ హిస్తున్న ఆరోగ్య సిబ్బంది

డెంగీ మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం డెంగీ మాసోత్సవ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ బేగ్, డాక్టర్ వెలిగొండ రెడ్డి, సూపర్వైజర్లు దిలీప్ కుమార్, శ్రీనివాసరావు, సుభాషిని, పీహెచ్ఎం దుర్గా కుమార్, ఎంఎల్ హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పల్లెర్ల గంగిరెడ్డి మాస్టారు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల

మూడున్నర దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వర్తించి ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన పల్లెర్ల గంగిరెడ్డి(75) మాస్టారు సోమవారం రాత్రి మృతి చెందారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో ఉన్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వైఆర్ఎస్ హైస్కూల్లో పనిచేస్తూ ఆ పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మాస్టారు మృతదేహాన్ని సందర్శించి పలువురు సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

టైం స్కేల్ వర్తింపజేయాలని వినతి

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యం లో బీసీ కె గంగాధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం తెలుగు అకాడమీలో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులకు టైంస్కేల్ అమలు చేయాలని సూచించారనీ, నాగార్జున యూనివర్సిటీలోనూ అమలు చేయాలని కోరారు. వర్సిటీ రిజిస్ట్రార్ జి సింహాచలం, రెక్టార్ కె.రత్నషీలామణికు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ దినసరి వేతన ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. స్థానిక 23, 24 వార్డులలో ఆమె పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సైడ్ డ్రెయిన్లు పూడికతీత పనులను పరిశీలించిన ఆమె పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వ్యర్థాలను కాలువలలో వేయకుండా తగ్గు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మి లావణ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం ఏసుబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబ శివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనరేటివ్ ఎఐ, డీప్ లెర్నింగ్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నైపుణ్యాభివద్ధి ఆవిష్కరణలలో భారతదేశంలోని ప్రముఖ సంస్థలలో ఒకటైన కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జనరేటివ్ ఎఐ, డీప్ లెర్నింగ్ అనే అంశంపై నాలుగు రోజుల అవగాహనాసదస్సును మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఇన్ఫోసిస్ సహకారంతో నిర్వహించ బడుతోందని కెఎల్ యు స్కిల్ డెవలెప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల నుండి పలువురు ఆచార్యులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌లెర్నింగ్ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలపై అత్యాధునిక పరిజ్ఞానం అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ వర్క్ షాప్ రెండు అధిక–ప్రభావ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు. 1. జనరేటివ్ ఎఐ విద్యారంగం, పరిశ్రమలో ప్రాథమిక అంశాలు, సాధనాలు, నైతిక చిక్కులు, అనువర్తనాలను కవర్ చేస్తుందన్నారు. 2. డీప్ లెర్నింగ్ - న్యూరల్ నెట్‌వర్క్‌లు, ఆర్కిటెక్చర్‌లు, రియల్–టైమ్ డిప్లాయ్‌మెంట్ యూజ్ కేసులపై దృష్టి సారించడమని చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ ఉన్నత విద్య, పరిశోధనలలో ఎఐ పెరుగుతున్న ఔచిత్యాన్ని వివరించారు.

డెంగీ నివారణకు చర్యలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

డెంగ్యూ నివారణ మాసోత్సవాలలో భాగంగా ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలో మంగళవారం మురుగునీటి నిల్వలతో పాటు కూలర్లు ఏసీలు, మంచినీరు నిలువ ఉండే పరికరాలు పరిశీలిస్తూ ప్రజలకు తగిన సలహాలు సూచనలు ఇస్తున్నారు. మురుగునీరు నిలువ ఉండే గుంటల్లో కాలువలలో ఏబేట్ (దోమల నివారణ మందు) వేస్తున్నారు. దోమలు కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది జి.శ్రీనివాసరావు పి.స్వరూప రాణి, టి.మాధవి పాల్గొన్నారు.

నేడు యార్డుకు సెలవు

ప్రజాశక్తి - దుగ్గిరాల

దేశవ్యాప్తంగా బుధవారం కార్మికులు సమ్మె చేస్తున్నందున స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యాడ్ కు సెలవు ప్రకటించినట్లు సెక్రెటరీ జె వి సుబ్బారావు తెలిపారు. క్రయ విక్రయాలు జరగ నందున రైతులు యార్డుకు పసుపు తీసుకు రావద్దని కోరారు. తిరిగి గురు వారం నుండి యార్డు యధాతథంగా పనిచేస్తుందన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మంగళగిరి పట్టణంలో గల అర్బన్ హెల్త్ సెంటర్లలో సిఐటియు నాయకులు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఒప్పంద జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. ఆశాలకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.శ్రీరాములు, ఆశావర్కర్ల యూనియన్ నాయకురాలు పి.కుమారి, ఎస్.భాగ్యలక్ష్మి, షేక్ నసీమా, మహాలక్ష్మి, స్వర్ణలత, కే భారతి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వివి జవహర్లాల్ అన్నారు. మంగళవారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుల విస్తృత సమావేశానికి టి శ్రీనివాసరావు అధ్యక్ష వహించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కొరకు వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అందరికీ వర్తింపజేయాలని కోరారు. భవననిర్మాణ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి షేక్ జానీ భాష, సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, భావన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం శివారెడ్డి, సిహెచ్ సత్యనారాయణ, పాగోలు శంకర్రావు, కే ఏసు, మేస్త్రీలు నారయ్య, ఎం వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



తాడేపల్లిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్ఆర్ అభిమానులు

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి కార్యక్రమం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలోని వైఎస్ఆర్సిపి కార్యాలయం, ప్రాతూరు రోడ్డులోని జాతీయ రహదారి వద్ద మంగళ వారం నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్సిపి తాడే పల్లి మండల అధ్యక్షులు అమరా శివనాగేశ్వరరావు, కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు మిర్యాల రాంబాబు కేక్‌కట్‌చేసి, వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రాతూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద ఉన్న వైయస్సార్, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్సిపి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైయస్ ఆర్సీపీ గుం టూరు జిల్లా అధికార ప్రతినిధి కాసినేడి బాజీ గంగా ధరరావు, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల కార్యదర్శి కమ్మిశెట్టి శివ నాగేశ్వరరావు, వైయస్సార్సీపి కుంచనపల్లి గ్రామ ఉపాధ్యక్షులు నల్లపు రవితేజ, వైఎస్ఆర్సిపి గ్రామ సీనియర్ నాయకులు గడ్డంతాతారావు, కూరపాటి సాంబిరెడ్డి, చాగంటి వెంకటరెడ్డి, బిరుదుగడ్డ విజయేంద్రరావు, నల్లపు రాంబాబు, బండి దాసు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

వైఎస్ఆర్సిపి మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఇన్చార్జ్ డి.వేమారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నాలివెంకట కృష్ణ, చల్లపల్లి మోహన్‌రావు, మల్లవరపు సుధారాణి, సంకే సునీత, ఎం.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం, మహిళలకు చీరలు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్య సభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, లేళ్ల అప్పి రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

పజల సేవే లక్ష్యంగా పాలన సాగించిన మహొన్నత వ్యక్తి, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మనసులలో చిరస్మరణీయులని పెదనందిపాడు వైసిపి మండల కన్వీనర్ షేక్ కాసింపీరా అన్నారు. పెదనందిపాడులోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి సర్పంచ్ దాసరి పద్మారావు, దివ్వి రాంబాబు, జిల్లా నాయకులు చెరుకూరి సాంబశివ రావు, మాజీ సొసైటీ అధ్యక్షులు దివ్వినాగయ్య, ధూళిపాళ్ళ సుబ్బారావు, కమ్మ సాంబశివరావు, గణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. పలు గ్రామాల నుంచి వైయస్సార్ అభి మానులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై ఒక రోజుశిక్షణ

ప్రజాశక్తి - చేబ్రోలు

మంగళవారం మండల ప్రజా పరిషత్ చేబ్రోలు సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ పురోగతి సూచికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో టి ఊహారాణి అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో తహల్దార్ కె శ్రీనివాస శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశాన్ని రాసుకొని క్షుణ్ణంగా పరిశీలించి , శిక్షణను ఉపయోగించుకోవాలని కోరారు. ఎంపీడీవో టి ఊహారాణి మాట్లాడుతూ శిక్షణ రిసోర్స్ పర్సన్స్ గా పంచాయతీ కార్యదర్శి టి సాయి శ్రీనివాస్ , డిజిటల్ అసిస్టెంట్లు ఎన్ వి ఎల్ త్రివేణి, బి ఆదినారాయణ శిక్షణ అంశాలను వివరిస్తారని గతంలో పంచాయతీ పురోగతిని పంచాయితీ డెవలప్మెంట్ ఇండెక్స్ అనే కొలమానంతో కొలిచేవారు. ఇప్పుడు ఆ విధానాన్ని పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ అని రూపాంతరం చేసి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రవిశంకర్ , పిఆర్ఏఈ , ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ, ఎంఈఓ, ఇతర మండల స్థాయి అధికారులందరూ పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక (2.0 వెర్షన్) 2023- 24 సంవత్సరానికి సంబంధించి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ కె శివపార్వతి హాజరయ్యారు. కార్యక్రమంలో పంచాయతీ పురోగతి సూచిక తయారు చేసేందుకు అనుసరించవలసిన విధి విధానాలను ఎంఓటిల ద్వారా శిక్షణ ఇచ్చారు. 2030 నాటికి సుస్థిర అభివృధి లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వం వారు తొమ్మిది థీమ్‌లను రూపొందించి వాటిని 147 సూచికలు, 227 దత్తాంశాలను రూపొందించారని, ఇవి గ్రామ పంచాయతీ స్థాయిలో ఏ మేరకు సాదించారని తెలుసుకోవడానికి ఈ పంచాయతీ పురోగతి సూచిక 2.0 ఉపయోగ పడుతుందని తెలియచేశారు. పంచాయతీ పురోగతి సూచిక 2.0 స్కోర్‌ల నుననుసరించి జాతీయ పంచాయతీ అవార్డులను. ఉత్తమ పనితీరు కనపరిచిన పంచాయతీలకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తారని తెలిపారు. శిక్షణా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రతి పంచాయతీ జాతీయస్థాయిలో మొదటి బహుమతి పొందటానికి కృషి చేయాలని డిపిఓ ఎన్.వి. సాయికుమార్ అన్నారు .పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అవార్డు పొందడం వలన పంచాయతీకి రూ. కోటి బహుమతితో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్ ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు పిఓపిఆర్డి జవహర్లాల్ నెహ్రూ సూపర్ ఇంటెండెంట్ చంద్రమోహన్ ఏపీవో సురేష్ హౌసింగ్ ఏఈ సుబ్బారావు ఎంఈఓ కే.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శిలు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే విద్యుత్ వినియోగదారులు వ్యతిరేకించాలని సిపిఎం పాత మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం చలపతిరావు మాట్లాడుతూ ఆదాని కంపెనీ స్మార్ట్ మీటర్ బిగించడానికి ఏజెంట్లు వస్తున్నారని విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండి వ్యతిరేకించాలని కోరారు. ప్రీ పెయిడ్ మీటర్‌తో అదనపు భారం పడుతుందని అన్నారు. ఇంటి పన్ను పెంచడానికి కార్పొరేషన్ అధికారులు కొలతలు వేయడానికి వస్తే వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో పాత మంగళగిరి సిపిఎం నాయకులు బి స్వామినాథ్, ఎస్ కోటేశ్వరరావు, కే నాగబాబు, ఏ సాంబశివరావు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న ఎంపీపీ షేక్ జబీన్

20 ఎకరాల పండ్ల తోటలు మంజూరు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పండ్ల తోటల పెంపకంలో భాగంగా మంగళవారం దుగ్గిరాల మండలంలోని అనేక గ్రామాలలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో 20 ఎకరాలు పండ్ల తోటలు మంజూరు కాగా ఇప్పటివరకు 10ఎకరాల రైతులు ముందుకు వచ్చినట్లు తెలిపారు. చింతలపూడి గ్రామంలో రైతు పేరం భాస్కరరావుకు చెందిన 8సెంట్ల పొలంలో నిమ్మ, పెనుమూలి గ్రామానికి చెందిన రైతు గారపాటి పూర్ణచంద్రరావు 70 సెంట్లు పొలంలో మామిడి మొక్కలు నాటారు. వీర్లపాలెం గ్రామంలో రెండు ఎకరాలలో గులాబీ మొక్కలు నాటవలసి ఉన్నది . మొక్కలు కొనుగోలుకు 100శాతం సబ్సిడీతో తోటల పెంపకానికి మూడేళ్లు, గులాబీ తోట పెంపకానికి రెండేళ్ల నిర్వహణ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఎంపీపీ షేక్ జబీన్ సర్పంచులు రామకృష్ణ కొరిటాల సురేష్ కార్యదర్శులు



తెలుగుభాష సేవా పురస్కారం అందుకున్న ఆళ్ల నాగేశ్వరరావు

తెలుగుభాషా సేవా పురస్కారం అందుకున్న ఆళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు తెలుగుభాష సేవా పురస్కారాన్ని అందుకున్నారు. చిత్తూరు జిల్లా, పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆ సంస్థ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పలువురు కవులు, రచయితలకు తెలుగుభాష సేవ పురస్కారాలను అందజేసింది. అందులో భాగంగా ఆదివారం అక్కడి సాయి గార్డెన్ సిటి కళామందిరంలో ఆళ్ల నాగేశ్వరరావును ఘనంగా సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు తులసి నాదం నాయుడు, కె పుష్ప, బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్త రమేష్, కడపకు చెందిన జానమద్ది సాహితీ పీఠం నిర్వాహకులు విజయభాస్కర్ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. వృత్తిరీత్యా ఆర్టీసీ కండక్టర్గా పనిచేస్తున్న ఆళ్ల నాగేశ్వరరావు ఈ సందర్భంగా గుంటూరు టు మేనేజర్ సిహెచ్ సునీత, సిఐ సాంబశివరావు, సిబ్బంది అభినందించారు.

నూట ఎన్నికల నోటిఫికేషన్ రద్దు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపక సంఘం (నూట) ఎన్నికలను ఆపివేస్తూ ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఆపమని అందుకు సంబంధించిన చర్యలు అదనంగా తీసుకోవద్దంటూ ఆదేశించినట్లు సమాచారం. నోటిఫికేషన్ కు సంబంధించిన నిబంధనలు పాటించలేదని , తదితర కారణాల వలన ఎన్నిక నిలిపివేయాలని పిటిషన్ వేయగా ఆ మేరకు విచారించిన హైకోర్టు ఎన్నిక నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందనీ పిటిషనర్ సుమంత్ కుమార్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

రూ.34.15 కోట్లతో అభివృద్ధి పనులు

ఆమోదించిన జిఎంసి స్థాయి సంఘం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో రూ.34.15 కోట్లతో వివిధ డివిజన్లలో పలు అభివృద్ధి పనులను నిర్వహించటానికి జిఎంసి స్థాయిసంఘం ఆమోదం తెలిపింది. మంగళవారం జిఎంసిలోని మేయర్ చాంబర్‌లో స్థాయి సంఘం అధ్యక్షులు కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన స్థాయి సంఘ సమావేశం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించారు. సమావేశంలో 101 అంశాలకు సంబంధించి అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో ఆహ్లాదం క కోసం ఏర్పాటు చేసిన పలు పార్కులు మరమ్మతులకు గురైన వాటిని గుర్తించి వాటిని ఆధినిక హంగులతో అభివద్ధి చేయుటకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా నగరంలోని శివారు ప్రాంతాలలో అభివద్ధి పనులు నిర్వహించటానికి శంకుస్థాపనలు కూడా చేస్తున్నామని తెలియచేశారు. జిమ్ లు, వాకింగ్ ట్రాక్ లను కూడా అభివద్ధి చేయుటకు ఆమోదం తెలిపామన్నారు.అంతేకాక ప్రజా ప్రతినిధులు మరియు ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సి.సి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు. విలీన గ్రామాల్లో కూడా నూతనంగా సిసి డ్రైన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామన్నారు. సదరు సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మి దుర్గ, ముప్పవరపు భారతి, షేక్ మీరావలి, నగర పాలక సంస్థ విభాగాధిపతులు పాల్గొన్నారు.


ఫార్మా డి ఫలితాల్లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జూన్ చివరి వారంలో విడుదల చేసిన ఫార్మా డి ఫలితాల్లో స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలియచేశారు. ద్వితీయ సంవత్సరంలో 28 మంది హాజరవగా 17 మంది డిస్టింక్షన్‌లో, 11 మంది ప్రథమశ్రేణి లోఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థిని నాగమల్లిశ్రీశిల్ప ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.తృతీయ సంవత్సరంలో 30 మంది హాజరు కాగా 28 మంది డిస్టింక్షన్‌లో, ఇద్దరు ప్రథమశ్రేణి లోఉత్తీర్ణత సాధించారన్నారు.విద్యార్థిని వుస్తుపల్లి భార్గవి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. నాలుగో సంవత్సరంలో 37 మందికిగాను 27 మంది డిస్టింక్షన్‌లో, 10 మంది ప్రథమ శ్రేణిలోఉత్తీర్ణత సాధించారని తెలిపారు. హరి శ్రీజభాను ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఐదవ సంవత్సరం పరిక్షలకు 31 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 17 మంది డిస్టింక్షన్‌లోను, 11 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలియచేశారు. గుంటూరు వెంకట శ్రీలేఖ, తంగిరాల హైమ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, హెచ్.ఓ.డి. డాక్టర్ ఎన్.హేమకుమారి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

టిజెపిఎస్‌కు పూర్వ విద్యార్థులు టివి వితరణ

ప్రజాశక్తి-గుంటూరు



పూర్వ విద్యార్థులు అందచేసిన టివితో ప్రిన్సిపాల్, తదితరులు

స్థానికి టిజెపిఎస్ కాలేజి (1975-1978) సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు లక్ష రూపాయలు విలువ చేసే స్మార్ట్ టివిని కళాశాలకు బహుకరిం చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్. కామేశ్వరశాస్త్రి తెలిపారు. కళాశాల సెక్రటరీ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ విద్యా బుద్ధులు నేర్పి జీవితాలలో ఉన్నత స్థితిలో ఉండటానికి పునాదిగా నిలిచిన కళాశాల అభ్యున్నతికి పూర్వ విద్యా ర్థులు వెన్నుదన్నుగా నిలవటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని కె.నాగ లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.భానుమురళీదర్, పూర్వ విద్యార్థులు యలమంచిలి మురళి, కిలారి కృష్ణా రావు, విద్యాసాగర్‌రెడ్డి, మధుబాబు, లీలాకష్ణ, మనోహర్, ప్రసాద్, ఖలీల్, ఖాశీమ్, ఇమామ్ పాల్గొన్నారు.

స్టాకు 30 వేల టన్నులు.. కొన్నది 2800 టన్నులు మాత్రమే!

స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి- పెదనందిపాడు



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు

ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో 30వేల టన్నుల పొగాకు ఉంటే కేవలం ఇప్పటికి 2008 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, ప్రభుత్వం స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెదనందిపాడు తేళ్లనారాయణ విజ్ఞాన కేంద్రంలో రైత సంఘం సమావేశం అనంతరం మీడియాతో మట్లాడారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలలో రైతుల వద్ద పొగాకు 30 వేల టన్నులు ఉన్నదని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో కేవలం 2,008 టన్నుల మాత్రమే కొనుగోలు జరిగిందని తెలిపారు. పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. పొగాకు మూడు గ్రేడులుగా విభజించి ఏ గ్రేడ్ రూ.12,000, బి గ్రేడ్ రూ.9,000, సి గ్రేడ్ రూ.6,000 నిర్ణయించారని, కొంటున్న దానిలో ఏ గ్రేడ్ 20శాతం, బి గ్రేడ్ 20 శాతం, మిగతాదంతా సి గ్రేడ్ కింద కొంటున్నారని తెలిపారు. పెద్ద ఎత్తున పొగాకు చెక్కులు రిజెక్ట్ చేసి పంపిస్తున్నారని తెలిపారు. మద్దతు ధర రూ.12,000 రైతులకు అందే విధంగా చూడాలన్నారు. రైతుల వద్ద ఉన్న పొగాకు చివరి ఆకు వరకూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఆ విధంగా కొనుగోలు జరిగే విధంగా చూడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బి రామాంజనేయులు పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఏర్పాటు చేయలేదని, వెంటనే పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, పొగాకు కొనుగోలు గురించి సమాచారం రైతులకు, రైతు సేవా కేంద్రం అధికారులు ముందుగా తెలియజేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్ మొదలైందని రైతు సేవా కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయం 20,000 రూపాయలు వెంటనే రైతులు, కౌలు రైతులకు అందించాలని కోరారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు,ఇతర ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులకు రుణాల నిమిత్తం లీడ్ బ్యాంక్ రూ.170 కోట్లు కేటాయించారని, 56,000 కౌలు రైతు కార్డుల జారీకి నిర్ణయించారని, వీటిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు, దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, కన్నెగంటి చంద్రరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న సామాజిక పింఛన్లు, తెల్లరేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ వంటివి ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగులకూ వర్తింప చేయాలని కోరుతూ ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెన్షన్ బిక్ష కాదని, హక్కు అని వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కె.గంగాధర్ రావు మాట్లాడుతూ అతి తక్కువ పింఛన్‌తో జీవిస్తున్న ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలు, ముఖ్యంగా నిత్యావసరాలు ధరలు అనేక రెట్లు పెరిగాయని, వృద్ధులకు వైద్య ఖర్చులు, మందుల ధరలు కూడా పెరిగాయన్నారు. కానీ ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగులకు అందుతున్న పింఛన్ ఏమాత్రం సరిపోవటంట్లేదన్నారు. కావున పింఛన్, రేషన్ కార్డు వంటి సంక్షేమ కార్యక్రమాలు వర్తింప చేయాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.నికల్సన్, పి. శేషగిరిరావు, బి.నాగేశ్వరరావు, నాంచారయ్య, సిహెచ్ వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, ఎం.శంకరరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సచివాలయ మహిళా పోలీసులు నిరసన

బదిలీల్లో అన్యాయం జరిగిందని ఆవేదన

ప్రజాశక్తి-గుంటూరు



నిరసన తెలియజేస్తున్న మహిళా పోలీసులు

గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ గ్రామ, వార్డు సచియవాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని కలెక్టరేట్‌లో రాత్రిపూట భైటాయించారు. సచియవాయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్, ఎమినిటీ, అన్ని విభాగాల సెక్రెటరీలకు వార్డు నుండి వార్డుకు బదిలీలు చేశారని, తమను మాత్రం దూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. ఇటీవల బదిలీల కోసం దరఖాస్తు చేసుకోమని ఆప్షన్లు ఇచ్చారని, కానీ తాము కోరుకున్న ప్రాంతాలకు కాకుండా వేరే ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. అర్బన్‌లో పనిచేస్తున్న వారిని కూడా రూరల్‌కు బదిలీ చేశారన్నారు. సుమారు 150 మందిని దూర ప్రాంతాలకు బదిలీ చేశారని, కొంత మందిని వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న మాచర్ల పరిసరాలకు కూడా బదిలీ చేశారన్నారు. ఈ విషయంపై కనీసం సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. అంతే కాకుండా మొత్తం జాబితాలో సుమారు 350 మంది పేర్లు అసలు జాబితాలోనే కనిపించట్లేదన్నారు. సంవత్సరం క్రితం బదిలీ అయిన వారిని కూడా ఇప్పుడు మళ్లీ బదిలీ చేశారన్నారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.